రక్షణ గోడకు మోక్షమెప్పుడో ?

- మూడు నెలల కిత్రం కుప్పకూలిన వైనం
- నిత్యం ప్రమాదాలతో స్థానికుల భయాందోళన
- యుద్ధప్రాతిపదికన నిర్మాణం చేపడతామని చెప్పిన అధికారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



కృపానందంవీధిలో రక్షణ గోడ కూలిపోయిన ప్రదేశం

వించిపేట(విజయవాడపశ్చిమ):స్థానిక 49వ డివిజన్ ప్రైజర్‌పేట కృపానందంవీధిలోని వాటర్ ట్యాంక్ రక్షణ గోడ మూడు నెలల కిత్రం రాత్రి సమయంలో ఒక్క సారిగా కుప్పకూలి రాళ్లు, పట్టిచరియలు కింది నివాసాల మీద పడ్డాయి. ఈ ఘటనలో స్థానిక మహిళ ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలియడంతో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధి అక్కడకు చేరుకుని పరిస్థితిపై స్థానికులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన వాటర్ ట్యాంక్ రక్షణ గోడ నిర్మాణం చేపడతామంటూ ఆర్భాటంగా హామీలు ఇచ్చి వెళ్లారు. ఇది జరిగి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ రక్షణ గోడ నిర్మాణానికి ఒక్క ఇటుక కూడ వేయకపోవడంతో నిత్యం ప్రమాదాలతో ప్రజలు భయందోళన మధ్య రాకపోకలు సాగిస్తున్నామని వాపోతున్నారు.

శిథిలావస్థలో రక్షణ గోడ....

సుమారు 60 ఏళ్ల క్రితం ప్రైజర్‌పేటలోని కృపానందంవీధి కొండ ప్రాంతంలో భూగర్భ వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి దాని చుట్టు కొండ రాళ్లతో రక్షణ గోడ నిర్మాణం చేశారు. ఈ ప్రహరీని అనుకొని కొండప్రాంతం నుంచి సైడు డ్రెయిన్ కూడా చేపట్టడంతో డ్రెయిన్ నీరు, వాటర్ ట్యాంక్ ఓవర్ ఫ్లో నీటి ప్రవాహంతో రక్షణ గోడలకు తరచూ పగుళ్ల ఏర్పడి మురుగునీరు స్థానిక నివాసాల మీదుగా పారుతుండేది. దీంతో అధికారులు మరమ్మతులు చేపట్టి సరిపెట్టేవారు. ఈ క్రమంలోనే మూడు నెలల క్రితం రాత్రి ఒక్కసారిగా రక్షణ గోడ పెద్ద శబ్దంతో కుప్పకూలి రాళ్లు, మట్టి చరియలు కింది నివాసాల మీద పడి వీధిలోకి మురుగునీరు పెద్ద ప్రవాహంతో పారింది. ఆ సమయంలో అప్పటి వరకు పనులు చేసుకుంటున్న మహిళ త్రుటిలో తప్పించుకోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. దీని తీవ్రతకు కింది నివాసం గోడలు పగిలిపోవడంతో పాటు విద్యుత్ స్తంభం పూర్తిగా వంగిపోయింది. దీంతో స్థానికులు భయందోళతో పరుగులు తీశారు.



కొండ రాళ్లు దొర్లడంతో సమీపంలోని నివాసానికి ఏర్పడిన రంధ్రం

పట్టించుకోని ప్రజాప్రతినిధులు...

ఘటన జరిగినప్పుడు నగరపాలకసంస్థ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై స్థానికులతో మాట్లాడారు. యుద్ధ ప్రాతిపదికన వాటర్ ట్యాంక్ రక్షణ గోడ నిర్మాణం చేపటనున్నట్లు స్థానికులకు హామీ ఇచ్చారు. తాత్కాలికంగా డ్రెయిన్‌కు ఇసుక బస్తాలను అడ్డుగా వేసి వెళ్లిపోయారు. మూడు నెలలు గడుస్తున్నా నేటికీ రక్షణ గోడ నిర్మాణం చేపట్టకపోవడంతో నిత్యం డ్రెయిన్, ట్యాంక్ ఓవర్ ఫ్లో నీటితో కృపానందంవీధి పాకుడు పట్టి రాకపోకల సమయంలో ప్రజలు జారి పడి ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్ రక్షణ గోడ నిర్మాణం చేపట్టి ప్రమాదాల నుంచి నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

మా ఇంటి గోడలు పగిలిపోయాయి



వాటర్ ట్యాంక్ రక్షణ గోడ కూలిన ప్రమాదంలో సమీపంలోని తమ ఇంటి మీద పెద్ద, పెద్ద బండరాళ్లు దొర్లడంతో ఇంటి గోడలు పడిలి రంధ్రాలు ఏర్పాడ్డాయి. అధికారులు వచ్చి చూసి వెళ్లారే గానీ పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు.

– మాతంగి స్వర్ణ, ప్రైజర్‌పేట

తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి



నిత్యం వీధిలోకి మురుగు నీరు ప్రవాహించడంతో నాచుపట్టి నడచి వెళ్లే సమయంలో జారి కిందపడి అనేక మంది గాయాలపాలవుతున్నారు. మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు సమస్యను పరిష్కరించలేదు. నాయకులు రోడ్డు మీద నుంచే వచ్చి వెళ్తున్నారే గానీ సమస్య ఉన్న కొండపైకి రావటం లేదు.

– చింతల సుబ్బులు, ప్రైజర్‌పేట

క్లుప్తంగా

వినాయకస్వామికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సంకట హర చతుర్ధిని పురస్కరించుకుని కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో వినాయక స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని వరసిద్ధి వినాయక స్వామి వారికి తెల్లవారుజామున సుప్రభాత సేవ, అనంతరం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించగా, అభిషేకాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు తరలివచ్చారు. అనంతరం స్వామి వారికి గరికతో విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రతి నెలా స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నామని, భక్తులు, ఉభయదాతలు పాల్గొనాలని ఆలయ ఈవో వై. సీతారామయ్య, చైర్మన్ నందిపాటి వెంకట శ్రీనివాసరావు పేర్కొన్నారు.

నేటి నుంచి త్యాగరాజ ఆరాధన మహోత్సవాలు



విజయవాడ కల్చరల్: హంసధ్వని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నుంచి నాలుగు రోజులపాటు పడమట దత్తపీఠంలోని శ్రీ మరకత రాజరాజేశ్వరి దేవాలయంలో త్యాగరాజ ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు యనమండ్ర శ్రీనివాసశర్మ తెలిపారు. గాంధీనగర్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఉదయం సనాతన వైదిక పద్ధతిలో త్యాగరాజ ఆరాధన ప్రారంభమవుతుందని, పంచరత్న కృతుల గోష్టిగానం, ములుకుట్ల బ్రహ్మనందశాస్త్రిచే త్యాగరాజ కృతి వైభవం ఉంటుందని చెప్పారు. 19వ తేదీ ఆధ్యాత్మిక ప్రసంగాలు, 20న వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో త్యాగరాజ కృతిగానం, 21, 22 తేదీల్లో ఆధ్యాత్మిక ప్రసంగాలు, సంగీత కచేరీలు నిర్వహిస్తునట్లు తెలిపారు. అనంతరం ఆరాధన మహోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దేవులపల్లి రామశాస్త్రి, గోపీకృష్ణశర్మ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో క్రైస్తవులపై దాడులు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో పాస్టర్లు, చర్చిలపై దాడులు జరుగుతున్నా కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఏపీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్ బెన్నీ లింగం అన్నారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రైస్తవులపై కుట్ర చేస్తోందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు బీజేపీ చేతిలో కీలు బొమ్మలా మారిపోయాడన్నారు. క్రైస్తవ మతాన్ని అణచివేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో నిరుపేదలైన దైవ సేవకులకు గౌరవ వేతనం ఇవ్వడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆ గౌరవ వేతనం ఇవ్వడం లేదన్నారు. చర్చిల నిర్మాణం కోసం నిధులు విడుదల చేయాలని, జెరూసలేమ్ యాత్రకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



గన్నవరం: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు మండలంలోని కేసరపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం తోట నరేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల్లో ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ జగ్గయ్యపేటలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ పాఠశాల్లో ఏడో తరగతి విద్యార్థి బి.ఆశ్విన్‌బాబు, 9వ తరగతి విద్యార్థిని పి.శ్రావణలక్ష్మి ప్రథమ స్థానం సాధించినట్లు చెప్పారు. వీరి ప్రతిభను గుర్తించిన సెలక్టర్లు చత్తీస్‌గఢ్‌లో ఈ నెల 19 నుంచి 22 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన ఇద్దరు విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎన్. శ్రీదేవిని హెచ్‌ఎంతో పాటు ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఉపాధ్యాయులు అభినందించారు.

చిట్టినగర్‌లో విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు



విద్యుత్ విజిలెన్స్ తనిఖీలో పాల్గొన్న అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం చిట్టినగర్‌లోని గృహాలు, వాణిజ్య సముదాయాల్లో విద్యుత్ వినియోగిస్తున్న వారిపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వరరావు, విజయవాడ పట్టణ ఈఈ పి. రవీంద్రబాబు నేతృత్వంలో విద్యుత్ అధికారులు 47 బృందాలుగా ఏర్పడి 2353 గృహ సర్వీసులు, 166 వాణిజ్య సముదాయాల సర్వీసులను తనిఖీ చేశారు. వాటిల్లో 266 సర్వీసులకుగాను అదనపు లోడు 358 కేడబ్ల్యూ మొత్తానికి రూ.7, 93, 000 జరిమానా విధించారు. అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తున్న నాలుగు సర్వీసులకుగాను రూ.35 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, రవీంద్రబాబు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, అటువంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగితే 9440812362, 9440812363, 8331014951 మొబైల్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ విద్యుత్ విజిలెన్స్ తనిఖీల్లో విజయవాడ పట్టణం డి4 డీఈ టి.నాగేశ్వరరావు, చిట్టినగర్ ఏఈ ఎస్‌కె జానీబాషా, విజయవాడ పట్టణం డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు, లైన్ ఇనస్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సద్గురు త్యాగరాజస్వామి సంగీతోత్సవాలు



కచేరీ నిర్వహిస్తున్న బ్రహ్మానందరావు, వాద్య సహకారం అందిస్తున్న ఆంజనేయులు

విజయవాడ కల్చరల్: సంగీత సన్మండలి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి సంగీతోత్సవాలు భక్తిగా సాగుతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలను గానం చేస్తున్నారు. శుక్రవారం నాటి కార్యక్రమంలో సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు కేవీ బ్రహ్మానందరావు, సీహెచ్ శ్రీదేవి, వీరుభొట్ల సీతారమణి, ఆకురాతి కోదండ రామయ్య, రమాభగవాన్, మోహన్ కృష్ణ, గుడిపాటి శ్రీలలిత గాత్రంతోనూ కావూరి హేమ, అయ్యగారి శ్యామసుందర్ వీణతోనూ త్యాగరాజ కృతులను ఆలపించారు. కొండా సుబ్రహ్మణ్యం, పాలపర్తి ఆంజనేయులు, చావలి శ్రీనివాస్, అంబటిపూడి కామాక్షి, కేవీ రామకృష్ణ వాద్య సహకారం అందించారు.

నేడు నగర సంకీర్తన

సంగీత సన్మండలి అధ్యక్షుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఎనిమిది గంటలకు సంగీత విద్వాంసులచే సంగీత కళాశాల నుంచి త్యాగరాజస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాలతో నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నగరానికి చెందిన సంగీత విద్వాంసులు పాల్గొనాలని కోరారు.

లలితాదేవికి ప్రత్యేక పూజలు



లలితాదేవి ఉపాసన పూజలు, పారాయణం నిర్వహిస్తున్న మహిళలు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ):స్థానిక పూర్ణానందపేటలోని దాసాంజనేయ కోదండరామ సుబ్రహ్మణ్యేశ్వర వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో శుక్రవారం లలితా సహస్రనామ పారాయణ మండలి వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పలు పుష్పాలతో పూజలు నిర్వహించారు. 81 మంది మహిళలు సంప్రదాయ పద్ధతిలో లలితాదేవి ఉపాసన పూజలు, పారాయణం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కన్వీనర్ వేముల హజరత్తయ్య గుప్తా ఆధ్యాత్మిక వ్యాఖ్యానం చేస్తూ లలితా సహస్రనామ పారాయణ విశిష్టతను గురించి వివరించారు. బ్రహ్మాండ పురాణం 36వ అధ్యాయంలో లలితోపాఖ్యానంలో లలితా సహస్రనామ స్తోత్రం ఉందని, అందులో లలితా దేవిని సకల శక్తి స్వరూపిణి గానూ, సృష్టి స్థితి లయాధికారిణి గానూ వర్ణించబడిందన్నారు. హయగ్రీవుడు అగస్త్యమునికి లలితా సహస్ర నామ స్తోత్రాన్ని ఉపదేశించాడని, ఇందులో అనేక మంత్రాలు, సిద్ధి సాధనాలు, యోగ రహస్యాలు నిక్షిప్తమై ఉన్నాయని ప్రతీతి అన్నారు. ఈ స్తోత్రం పఠించడం వలన కష్టాలు కడతేరి, శుభాలు కలుగుతాయని, సిద్ధి ముక్తి లభిస్తాయని వివరించారు. పారాయణ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదాలను అందజేశారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం విజయవాడకు చెందిన శ్రీనృత్య కళానిలయానికి చెందిన నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచ హారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై గోనుగుంట శైలశ్రీ పర్యవేక్షణలో చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందచేయడంతో పాటు అమ్మవారి దర్శనం కల్పించారు.





ఆదమరిస్తే అంతే సంగతులు...



విజయవాడ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. కనీసం నడిచేందుకు కూడా వీలు లేని విధంగా ఉన్నాయి. రోడ్డుపై కంకర, రాళ్లు తేలి అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయి. గొల్లపూడి హైవే నుంచి అట్కిన్సన్ స్కూల్ రోడ్డు మలుపు వద్ద నెల కొన్న రహదారి దారుణంగా ఉంది. అలానే జక్కంపూడి కాలనీలో రోడ్డంతో గుంతలు పడి డ్రైనేజీ నిండి అధ్వానంగా మారింది. పాముల కాలువ వైపునకు వెళ్లే మార్గం సైతం ప్రమాదకరంగా తయారైన చిత్రాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



సామాజిక స్మృతి వనంలో డ్వాక్రా బజార్ తొలగించండి



మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందచేస్తున్న సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు):నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయం స్మృతి వనంలో అక్రమంగా ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌ను తొలగించాలంటూ మూమెంట్ 21 సభ్యులు బోరుగడ్డ సుబ్బయ్య, గడ్డం నగేష్ సోమవారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ డి.చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ స్మృతి వనంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌ను వెంటనే తొలగించాలని, ఆ ప్రాంగణలో మెరుగైన వసతలు కల్పించాలని కోరారు. ఆ డ్వాక్రా బజార్ కారణంగా గ్రీనరీ పాడవుతుందని, సందర్శకులకు ఇబ్బందిగా మారినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా మధ్యలో నిలిచిన కన్వెన్షన్ ఫంక్షన్ హాల్స్ నిర్మాణ హాల్స్‌ను పూర్తి చేయాలన్నారు. పలహారశాలను ప్రారంభించినట్లయితే ఈ ప్రాజెక్టుకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. అనంతరం తాడేపల్లిలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల వేదికలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబును కలిసి వినతిపత్రం అందచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలతోటి సురేష్ పాల్గొన్నారు.

రేపు ఇంటర్ విద్యలో సంస్కరణలపై సెమినార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటర్ విద్యలో సంస్కరణలకు సంబంధించి ఈ నెల 19వ తేదీ గాంధీనగర్‌లోని శారద కళాశాలలో సెమినార్ నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియెట్ విద్యా పెన్షనర్స్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గుమ్మడి నారాయణరావు, సంయుక్త కార్యదర్శి ఎల్.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్‌లో పదవీ విమరణ చేసిన జూనియర్ లెక్చరర్స్, ప్రిన్సిపాల్స్, బోర్డు అధికారులు, ఆర్ఐఓలు, ఆర్జేడీలు, డీవీఈవోలు హాజరవుతారన్నారు. ఇంటర్ విద్యలో సంస్కరణలు, మొదటి సంవత్సరం పరీక్షలు రద్దు, ఆప్షనల్ సబ్జెక్ట్ విధానం వంటి వాటిపై సెమినార్‌లో చర్చించనున్నట్లు తెలిపారు.

భాస్కరరావు ప్రజా సేవలు చిరస్మరణీయం



సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర నాయకురాలు రమాదేవి

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఆర్టీసీ కార్మిక నాయకుడిగానే కాకుండా ప్రజా సమస్యలపై స్పందించే కుండనాల భాస్కరరావు ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. కుండనాల భాస్కరరావు 20వ వర్ధంతిని పురస్కరించుకుని ఐద్వా పశ్చిమ సిటీ అధ్యక్షురాలు కుండనాల శేషుమణి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీలు, మహిళల ముగ్గుల పోటీలలో విజేతలకు శుక్రవారం సాయంత్రం విద్యాధరపురం మర్రిచెట్టు సెంటర్‌లో బహుమతి ప్రదానోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఐద్వా నాయకురాలు కుండనాల శేషుమణి భర్త భాస్కరరావు పేరుపై ప్రతి ఏటా సంక్రాంతికి ఆటల పోటీలు నిర్వహించి యువతను ప్రోత్సహిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ఆమె కుమారుడు కుండనాల అనిల్ వంశీ మరణించిన తరువాత ఇప్పుడు ఆ ఇద్దరి జ్ఞాపకార్థం పోటీలు నిర్వహించే ఆనవాయితీని కొనసాగించటం వారిద్దరూ అందించిన ప్రజా సేవలకు నిదర్శనమని తెలిపారు. 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు, మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, డీవైఎఫ్ఐ నాయకుడు అంజిబాబు, విక్రంలక్ష్మి, యశశ్విని, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి, గాయకుడు అప్పన్న, సుదర్శన్, ఎండీ మస్తాన్, మోహన్, పుల్లారావు, చంటి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమర జవాను సూర్యప్రకాశరావుకు ఘన నివాళి



అమర జవాన్ పెమ్మిరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న మేరీ, ప్రశాంతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీకి చెందిన పెమ్మిరెడ్డి సూర్యప్రకాశరావు వర్ధంతి సందర్భంగా శుక్రవారం కాలనీలోగల ట్రయాంగిల్ పార్క్ సెంటర్‌లోని పెమ్మిరెడ్డి విగ్రహానికి స్థానిక మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెమ్మిరెడ్డి సూర్యప్రకాశరావు వంటి సుశిక్షుతులైన జవాన్లు దేశ సరిహద్దుల్లో కాపలాకాస్తూ శత్రు సైన్యాల నుంచి ముప్పు వాటిల్లకుండా రక్షణగా ఉండటం వలనే దేశ ప్రజలు ప్రశాంతంగా ఉండగలుగుతున్నారని చెప్పారు. దేశభక్తితో సైన్యంలోచేరి 23 ఏళ్ల వయసులోనే కార్గిల్ యుద్ధంలో శత్రువులతో పోరాడుతూ వీర మరణం పొందిన పెమ్మిరెడ్డి కాలనీవాసి కావడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. ఆయనను కన్న తల్లిదండ్రులు పెమ్మిరెడ్డి వీర్రాజు, ఆదిలక్ష్మి దంపతులు అభినందనీయులని అన్నారు. కేవలం పెమ్మిరెడ్డి జయంతి, వర్ధంతి సందర్భాల్లోనే కాకుండా నిత్యం స్మరించుకోవల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అందె మేరీ, కోడేబోయిన స్రవంతి, సీత చంద్రశేఖర్, యనమల కాళిదాస్, కాశీ విశ్వనాథ్, మువ్వ విజయశ్రీ తదితరులు పాల్గొని పెమ్మిరెడ్డి సూర్యప్రకాశరావుకు నివాళులర్పించారు.

మైనార్టీ బాలికల హాస్టల్‌కు అద్దె భవనం కావాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయం(మైనార్టీ బాలికలు) హాస్టల్ కోసం అద్దె ప్రాతిపదికన భవనం కావాలని సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాస్టల్ కోసం 30వేల చదరపు అడుగుల భవనం అద్దెకు కావాలని, ఔత్సాహికులు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు 87126 25036 నంబరులో సంప్రదించాలని కోరారు.

21న విశ్వనాథ భాగవతార్ జయంతి వేడుకలు

విజయవాడ కల్చరల్: విఖ్యాత హరికథా భాగవతార్ అమ్ముల విశ్వనాథం 109వ జయంతి వేడుకలను దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో ఈ నెల 21వ తేదీ మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు భాస్కర్ల వేంకటసతీష్, బీవీ దుర్గాభవానీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరానికిగానూ తిరుపతికి చెందిన హరికథా భాగవతారిణి జయంతి సావిత్రికి హరికథా చూడామణి పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.